

రేపు చదరంగం పోటీలు

శ్రీకాకుళం : ఈనెల 11న సీనియర్ మహిళల విభాగంలో జిల్లాస్థాయి చదరంగం పోటీలను నిర్వహించనున్నట్లు సంఘ జిల్లా అధ్యక్షులు బగాది కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు శ్రీకాకుళం నానుబాల వీధిలోని జిల్లా చదరంగం శిక్షణా సంస్థ ఆవరణలో ఉదయం తొమ్మిది గంటలకు హాజరు కావాలని పేర్కొన్నారు. ప్రవేశ రుసుము రూ.200 చెల్లించాలని సూచించారు. పోటీల్లో రాణించిన క్రీడాకారులు ఈనెల 18 నుంచి 21వ తేదీ వరకు విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి చదరంగం పోటీల్లో జిల్లా తరుపున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఆసక్తి, అర్హత గల క్రీడాకారులు apchess.orgలో వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. అదే రోజున ఇన్విటేషన్ చదరంగం పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఉద్యోగుల సహనాన్ని పరీక్షించొద్దు

- ప్రజలకు ఇబ్బందులు కలగకూడదనే ఓపిక పడుతున్నాం
- మరో చలో విజయవాడ చేపట్టాల్సి ఉంటుంది
- ఎపి జెఎసి అమరావతి చైర్మన్ బొప్పరాజు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఉద్యోగులు 62 రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం సమస్యలు పరిష్కరించడం లేదని, వారి సహనాన్ని పరీక్షిస్తోందని ఎపి జెఎసి అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకూడదనే ఓపిక పడుతున్నామన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తెరగాలన్నారు. నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల ప్రాంతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. ఉద్యోగులు ఉప్పెనలా ఉద్యమిస్తే తప్ప రాష్ట్ర ప్రభుత్వం సమస్యలను పరిష్కరించేలా లేదన్నారు. ఉద్యోగుల సమస్యలపై గతంలో చేపట్టిన చలో విజయవాడ, పార్వతీపురం మన్యం జిల్లాలో ఉపాధ్యాయులు చేసిన తరహాలో పోరాడితే గానీ సమస్యలు పరిష్కారమయ్యేలా లేదన్నారు. ఉద్యోగులు 62 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం చలించడం లేదని, వారి సహనాన్ని, ఓర్పును చాలా తేలిగ్గా తీసుకుంటోందన్నారు. ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వానికి తెలియజేసినప్పుడు అవి సహేతుకం కాదని సమ్మె చేయడానికి వీల్లేదని చెప్పడమో, సమస్యలు పరిష్కరించడమో ఎందుకు చేయలేదని ప్రశ్నించారు.



మాట్లాడుతున్న ఎపి జెఎసి అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు

ఉద్యోగికి రూ.నాలుగు లక్షల వరకు బకాయి

ప్రభుత్వం ప్రతి ఉద్యోగికి రూ.1.50 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు బకాయి పడిందని చెప్పారు. ప్రభుత్వంపై రూ.నాలుగు కోట్ల భారం పడుతుందని 11వ పే స్కేల్ నివేదికను ప్రభుత్వం బయట పెట్టలేదన్నారు. విశ్రాంత ఉద్యోగులను సైతం బాధ పెడుతోందని, పెన్షన్ వస్తే చాలనుకునే పరిస్థితిని కల్పించిందన్నారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై ఎపి జెఎసి అమరావతి నిరంతరం పోరాడుతుందని భరోసానిచ్చారు. ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న స్కీమ్‌వర్కర్లను ప్రభుత్వం శ్రమ దోపిడీ చేస్తోందన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు రెండు సంవత్సరాల తొమ్మిది నెలలు గడిచినా ఒదుకు రెగ్యులరైజ్ చేయలేదని, పే స్కేల్ ఇవ్వలేదని ప్రశ్నించారు. ఉపాధ్యాయుల ఆత్మగౌరవం దెబ్బతినేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. విఆర్‌ఎలు ఇప్పటివరకు పొందుతున్న డిఎను ప్రభుత్వం వెనక్కి తీసుకోవడం దారుణమన్నారు. విఆర్‌ఎల్లో 3,500 మందికి ఉద్యోగోన్నతులను కల్పించి వారికి పే స్కేల్ ఇవ్వడం లేదన్నారు.

చర్చలకు పిలిచి చులకన చేస్తున్నారు

ఉద్యోగులను చర్చలకు పిలిచి చులకనగా మాట్లాడడం గతంలో ఎన్నడూ చూడలేదన్నారు. కళాశాలల్లో గంటల పని విధానంపై పనిచేసే వారికి 130 శాతం వేతనాలు పెంచిన ప్రభుత్వం, కెజిబివిలో పనిచేస్తున్న వారికి కనీసం టైమ్ స్కేల్ అమలు చేయడం లేదని విమర్శించారు. పోలీసులు, హోంగార్డులకు సరెండర్ లీవులు కూడా అమలు కావడం లేదన్నారు. ఆర్‌టిసి ఉద్యోగుల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలోకి పడినట్లుగా ఉందన్నారు. సిపిఎస్ ఉద్యోగులకు గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో పది శాతం వాటాను చెల్లించేవని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తన వాటాను 14 శాతానికి పెంచినా, రాష్ట్ర ప్రభుత్వం పెంచకపోగా ఉన్న డబ్బులను వాడేసుకుందని చెప్పారు. ఉద్యోగుల సిపిఎస్ ఖాతాలను చూపించి కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.25 వేల కోట్ల రుణాలను తీసుకుందని తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైనా పలు కారణాలతో 2004కు ముందు విధుల్లో చేరని వారంతా ఒపిఎస్ పరిధిలోకి వస్తారని కేంద్ర ప్రభుత్వం చట్టంలో మార్పు చేసినా, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. ధర్నాలు, భోజన విరామ సమయ నిరసనలతో సమస్యలు పరిష్కారం కావని, ఉద్యోగులు కదం తొక్కాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఎఐటియుసి నాయకులు ఎస్.వెంకట సుబ్బయ్య సంఘీభావం తెలిపారు. ఎపి జెఎసి అమరావతి జిల్లా చైర్మన్ శ్రీరాములు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర సహాధ్యక్షులు జె.వి ఫణికర్‌రాజు, కోశాధికారి మురళీకృష్ణంనాయుడు, నాయకులు రమణ, త్రినాథ్, లక్ష్మణరావు, రాజు, విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం తదితర జిల్లాల నుంచి ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో డెంగీ, మలేరియాలపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అధికారులను ఆదేశించారు. ఈనెల 16వ తేదీన నిర్వహించబోయే జాతీయ డెంగీ దినం, వెక్టర్ ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్నది వర్షాకాలం కావడం వల్ల అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. మూడు వేల పాఠశాలలకు నెట్స్ సరఫరా చేయాలని డిఎంఒ సత్యనారాయణను ఆదేశించారు. రెసిడెన్షియల్ స్కూల్, కెజిబివి, గిరిజన ఆశ్రమ పాఠశాలలో అందుబాటులో ఉన్న పిహెచ్‌సిలు, ఐటిడిఎ నుంచి నెట్స్ సరఫరా చేస్తారని చెప్పారు. మున్సిపాల్టీల్లో చిన్న చిన్న గల్లీలు, ఏరియాల్లో జాగ్రత్తలు తీసుకుని పరిశుభ్రతా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సిహెచ్ ఓబులేసు, డిపిఒ రవికుమార్, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అన్ని ఆస్పత్రులకు ర్యాపిడ్ కిట్లు సరఫరా చేసినట్లు చెప్పారు. జ్వరం ఉన్న వారు ఎవరైనా పరీక్షలు చేయించుకోవాలని, పరీక్షలో పాజిటివ్ వస్తే సంబంధిత రోగి సీరం తీసి శ్రీకాకుళం జిజిహెచ్, టెక్కలి జిల్లా ఆస్పత్రికి పంపిస్తే ఎలీసా పరీక్ష చేసి డెంగీ నిర్ధారణ చేస్తారన్నారు. పారిశ్రామిక ప్రాంతంలో వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు.

ప్రస్తుతం ఉన్న డెంగీ కేసులు అధికం కాకుండా చూసుకోవాలన్నారు. శానిటేషన్ సిబ్బందితో యాంటీ లార్వా స్ప్రే చేయించాలని డిపిఒను ఆదేశించారు. మండల స్థాయిలో పిఒలతో సమన్వయం చేసుకోవాలని డిఎంఒకు సూచించారు. ప్రతి శుక్రవారం గ్రామాల వారీగా వెబ్‌సైట్‌లో డ్రై డే, పరిశుభ్రత లేకుండా ఉన్న ప్రాంతాలను గుర్తించాలని, నీటి నిల్వ ప్రాంతాలు, తదితర వివరాలను అప్‌లోడ్ చేయాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని డిఎంఒ, మున్సిపల్, పంచాయతీ అధికారులను ఆదేశించారు.

జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి మాట్లాడుతూ ఎక్కడా నీటి నిల్వ లేకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలని చెప్పారు. గంబూషియా చేపలు జూన్ నాటికి సరఫరా చేయాలని కోరగా జులై, ఆగస్టు నాటికి సరఫరా చేస్తామని మత్స్యశాఖ జెడి శ్రీనివాసరావు శ్రీనివాసరావు తెలిపారు. ఆగస్టు మొదటి వారం నాటికి సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఐసిడిఎస్ పీడీ జి.జయదేవి, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, బిసి సంక్షేమశాఖ అధికారులు ఇ.అనురాధ, గడ్డెమ్మ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ప్రసాదరావు, ఎడిఎంహెచ్ఒ అనురాధ, పరిశ్రమల శాఖ ఎడి ఆర్.వి రమణారావు, యుపిహెచ్‌సి వైద్యాధికారి జె.కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

సరైన సమాధానంతోనే అర్జీదారు సంతృప్తి

జిల్లా ప్రత్యేక అధికారి సిద్ధార్థ్ జైన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

సరైన సమాధానంతోనే అర్జీదారు సంతృప్తి చెందుతారని జిల్లా ప్రత్యేక అధికారి సిద్ధార్థ్ జైన్ అన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని ప్రతి సచివాలయంలో జగనన్నకు చెబుదాం ఫోన్ 1902 నంబరు ప్రజలకు తెలిసేలా ఉండాలన్నారు. వ్యక్తిగత సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రైతులు, అక్కాచెల్లెమ్మలు, ప్రభుత్వ సేవలు పొందడం, రైతుభరోసా కేంద్రాలు, ఆర్‌బికె, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్, అంగన్వాడీ, ఆరోగ్యశ్రీ, రెవెన్యూ సమస్యలు, అర్జీదారులకు సంబంధించి నాణ్యమైన సమాచారం అందాలన్నారు. అర్జీలు తీసుకున్నప్పుడే అర్జీదారుని సమస్య గురించి ఓపికతో విని, సమస్యను అర్థం చేసుకుని అర్జీదారులను సంతృప్తిపరిచే సమాధానం చెప్పాలని స్పష్టం చేశారు. అర్జీదారుల సమస్య శాఖాపరమైన సమస్య కాకపోతే సంబంధిత శాఖకు పంపాలన్నారు.

వ్యవసాయశాఖ కమిషనర్ చౌదరి చిరంజీవి మాట్లాడుతూ అందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. అర్జీదారుల సమస్యలు ఓపిక, సహనంతో పరిష్కరించాలన్నారు. అర్జీదారుల నాణ్యమైన సమాధానంతో సంతృప్తిపరచాలన్నారు. కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ మండల, గ్రామస్థాయిలోనే సమస్యలు పరిష్కరించాలన్నారు. ఎస్‌పి జి.ఆర్ రాధిక మాట్లాడుతూ మనస్థాయిలో మనం బాగా పనిచేస్తే జగనన్నకు చెబుదాం అవసరమే ఉండదన్నారు. అర్జీదారులకు ఓపికతో సమాధానం చెప్పాలని తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, ఆర్‌డిఒలు బి.శాంతి, సీతారామ్మూర్తి, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, డిపిఒ రవికుమార్, సమగ్రశిక్ష ఎపిసి జయప్రకాష్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ప్రసాదరావు, బిసి సంక్షేమశాఖ అధికారి ఇ.అనురాధ, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

తగ్గించిన సెలవులను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

నీలం జ్యూట్ మిల్లులో యాజమాన్యం తగ్గించిన రెండు క్యాజువల్ సెలవులను వెంటనే పునరుద్ధరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, నీలం జ్యూట్ మిల్లు కార్మిక సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.నాగేశ్వరరావు, ఎన్.సూరిబాబు డిమాండ్ చేశారు. శ్రీకాకుళం రూరల్ మండలం సింగుపురం వద్ద గల నీలం జ్యూట్ మిల్లు యాజమాన్యం తగ్గించిన 2 క్యాజువల్ సెలవులు పునరుద్ధరించి, గతంలో మాదిరిగా 6 క్యాజువల్ సెలవులు అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ విశాఖపట్నం జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎం.రామారావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీలం జ్యూట్ మిల్లు పరిశ్రమలో 500 మంది కార్మికులు పనిచేస్తున్నారని చెప్పారు. 1987లో పరిశ్రమ ప్రారంభం నుంచి కార్మికులందరికీ 6 క్యాజువల్ లీవ్‌లు అమలు చేస్తోందన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి కార్మికుల లీవ్ రికార్డులో రెండు తగ్గించి నాలుగు సెలవులను యాజమాన్యం నమోదు చేసిందని తెలిపారు. యాజమాన్యం ఏకపక్షంగా రెండు సెలవులు తగ్గించడం కార్మిక వ్యతిరేక చర్య అని, దీన్ని కార్మికులంతా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. యాజమాన్యం తప్పుడు పద్ధతులు అవలంభిస్తూ కార్మికులకు అన్యాయం చేస్తోందని విమర్శించారు. కార్మికులకు అతి తక్కువ వేతనాలు ఇస్తూ శ్రమ దోపిడీకి గురిచేస్తున్న యాజమాన్యం, మరోవైపు ఇస్తున్న సెలవులను తగ్గించడం సరికాదన్నారు. తగ్గించిన సెలవులను వెంటనే పునరుద్ధరించకుంటే దశల వారీగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నాయకులు



మాట్లాడుతున్న శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

మౌలిక వసతుల కల్పనకు చర్యలు

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - సరుబుజ్జిలి

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని గోనెపాడులో తాత్కాలిక సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షల మేరకు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ సంక్షేమ పథకాలను అమలు చేస్తూ అభివృద్ధికి చిహ్నంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నిలుస్తున్నారని కొనియాడారు. గ్రామానికి దూరంగా ఉన్న మతలబుపేట సచివాలయం ద్వారా గోనెపాడు ప్రజలకు సక్రమంగా సేవలు అందడం లేదని తన దృష్టికి తీసుకురావడంతో గోనెపాడులో నూతన సచివాలయం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గ్రామంలో సచివాలయం ఏర్పాటుతో ప్రజలకు అన్నిరకాల ప్రభుత్వ సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. సచివాలయాల ఏర్పాటు వల్ల ప్రజల ముంగిటకు ప్రభుత్వ సేవలు సులభతరంగా చేరువవుతాయని చెప్పారు. నేటి నుంచి ప్రారంభం కానున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా ప్రజలు వారి కష్టాలు, ఇతర సమస్యలు చెప్పుకునేందుకు చక్కని వేదికగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సురవరపు నాగేశ్వరరావు, ఎంపిపి ప్రతినిధి కిల్లి సత్యనారాయణ, వైస్ ఎంపిపి లావేటి అనిల్ కుమార్, వైసిపి మండల అధ్యక్షులు బెవర మల్లేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కె.చంద్రశేఖర్, బిసి సెల్ డైరెక్టర్ ఎం.రమణ, ఎస్‌సి సెల్ డైరెక్టర్ యడ్ల ఈశ్వరరావు, సర్పంచ్ బిర్లంగి అమ్మాయమ్మ, స్థానిక నాయకులు బిర్లంగి నాగేశ్వరరావు, మామిడి తిరుపతిరావు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

న్యాయవాదుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం



జిల్లా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌లో ఉచితంగా కేసులు వాదించేందుకు అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పోస్టుకు న్యాయవాదుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షులు జునైద్ అహ్మద్ మౌలానా ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసే న్యాయవాదులు మూడేళ్ల లోపు క్రిమినల్ కేసులు చేయడంలో అనుభవం కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఈ పోస్టులకు ఎంపికైన తర్వాత న్యాయవాదులు తమ సొంత కేసులు వాదించేందుకు వీలుండదని స్పష్టం చేశారు. కేవలం జిల్లా న్యాయసేవాధికార సంస్థ లీగల్ ఎయిడ్ గ్రాంటు చేసిన కేసుల్లో మాత్రమే వాదించేందుకు వీలుంటుందని తెలిపారు. దరఖాస్తులను అధ్యక్షులు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు ఈనెల 19వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా అందజేయాలని పేర్కొన్నారు.



పొలంలో ఎర్రమ్మ మృతదేహం

సారవకోటలో జంట హత్యలు


మహిళ, ప్రియుడు దారుణ హత్య

ప్రజాశక్తి-శ్రీకాకుళం ప్రతినిధి

సారవకోట మండలం కోదాడ పనసలో జంట హత్యలు మంగళవారం ఆ ప్రాంతంలో కలకలం రేపాయి. ఈ ఘటనలో ఆ గ్రామానికి చెందిన ఎర్రమ్మ (38), సంతోష్ కుమార్ (26) మృతి చెందాడు. వివాహేతర సంబంధాల నేపథ్యంలో ఈ హత్యలు జరిగినట్లు తెలుస్తోంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు కోదాడ పనసకు చెందిన వెలమల భాస్కరరావు ఉపాధి కోసం ఇతర ప్రాంతానికి వలస వెళ్లాడు. అతని భార్య ఎర్రమ్మతో అదే గ్రామానికి చెందిన ముద్దాడ రామారావుకు పరిచయమైంది. ఇదే సమయంలో అదే గ్రామానికి చెందిన సంతోష్‌కుమార్ (26)తో ఎర్రమ్మ చనువుగా ఉంటోంది. దీన్ని తట్టుకోలేకపోయిన రామారావు ఇద్దరిపై కక్ష పెంచుకుని వారిని హతమార్చేందుకు పథకం వేశాడు. మంగళవారం సాయంత్రం ఎర్రమ్మ పొలానికి వెళ్లడాన్ని గమనించిన రామారావు ముందుగా వేసుకున్న ప్లాన్ ప్రకారం వెనుక నుంచి వెళ్లి కత్తితో మెడపై నరికాడు.



ఎర్రమ్మ (ఫైల్)



సంతోష్ కుమార్ (ఫైల్)

అక్కడ్నుంచి బయలుదేరి స్థానికంగా ఉన్న వంశధార కాలువలో స్నానం చేస్తున్న సంతోష్‌కుమార్ మెడపై కత్తితో నరకడంతో అక్కడిక్కడే కుప్పకూలిపోయాడు. ఘటనా సమాచారాన్ని తెలుసుకున్న సిఐ డి.రాము సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. క్లూస్ టీమ్ చేరుకుని పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టిక్కెట్ రేసులో ఉన్నా...

- ఇచ్ఛాపురంలో వైసిపి జెండా ఎగురవేస్తాం
- మారిటైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

వచ్చే ఎన్నికల్లో ఇచ్ఛాపురం నియోజకవర్గ వైసిపి అభ్యర్థిగా రేసులో ఉన్నానని ఎపి మారిటైమ్ బోర్డ్ చైర్మన్ కాయల వెంకటరెడ్డి తెలిపారు. గ్రామదేవత ఉత్సవాల సందర్భంగా స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయాన్ని మంగళవారం ఆయన దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆయన్ను సత్కరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇచ్ఛాపురం అభ్యర్థిని ముఖ్యమంత్రి త్వరలోనే ప్రకటిస్తారని చెప్పారు. తనకు 1981 నుంచి నియోజకవర్గంలో పరిచయాలు ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి తనకు కాదని వేరే వారికి ఇచ్చినా వారి గెలుపునకు తనవంతు కృషి చేస్తానన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని చెప్పారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలోనూ వైసిపి జెండా ఎగురవేస్తామన్నారు. గత ఎన్నికల్లో ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వైసిపి ఓటమిపాలైనా సుమారు రూ.750 కోట్లతో నియోజకవర్గంలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముఖ్యమంత్రి చేపట్టారని చెప్పారు. ఆయనతో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రతినిధి పి.సంతోష్ రెడ్డి, ఉలాల బాలయ్య, ప్రకాశరావు పట్నాయక్, తాడి ఆదిరెడ్డి, ఉలాల భారతీ దివ్య, పి.యాదవ రెడ్డి, పి.విజయ్ తదితరులున్నారు.



వెంకటరెడ్డిని సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



అధికారులతో మాట్లాడుతున్న పిఒ కల్పనా కుమారి

ఐటిడిఎ పిఒ విస్తృత పర్యటన

ప్రజాశక్తి - మెళియాపుట్టి

మండలంలో ఎత్తయిన కొండ ప్రాంతంలోని చందనగిరి గిరిజన గ్రామాన్ని సీతంపేట ఐటిడిఎ పిఒ కల్పనా కుమారి మంగళవారం సందర్శించారు. గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అసంపూర్తిగా ఉన్న రోడ్డును పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యత లోపించకుండా చూడాలన్నారు. బావుల్లో నీటిని క్లోరినేషన్ చేయాలని సూచించారు. అనంతరం మెళియాపుట్టి సమీపంలో నిర్మాణం చేపడుతున్న ఏకలవ్య భవన నిర్మాణాన్ని పరిశీలించారు. వచ్చే నెలకు నిర్మాణాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మెళియాపుట్టిలో ఐటిడిఎ ఆధ్వర్యాన పెట్రోల్ బంకును ఏర్పాటు చేసేందుకు స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఇఇ మురళి, డిఇ సిమ్మన్న, తహశీల్దార్ పి.సరోజిని, ఎంపిడిఒ పి.చంద్రకుమారి, ఎంఇఒ ఎస్.దేవేంద్రరావు, ఎఒ దానకర్ణుడు, ఎపిఎం లలిత, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు అధికారుల సత్కారం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

రెడ్‌క్రాస్ ద్వారా విశిష్ట సేవలందించినందుకు గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా బంగారు పతకాన్ని అందుకున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌ను జిల్లా అధికారులు మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా రక్తనిల్వల సేకరణ, తలసేమియా, క్షయ, కుష్టు రోగులకు సేవలు అందించడం వంటి అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, ఆర్‌డిఒలు బి.శాంతి, సీతారామ్మూర్తి, జెడ్‌పి సిఇఒ వెంకట్రామన్, డిపిఒ రవికుమార్, సమగ్రశిక్ష ఎపిసి జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌ను అభినందిస్తున్న జిల్లా అధికారులు


రికార్డులను పరిశీలిస్తున్న అనురాధ

లక్ష్యాల పూర్తికి చర్యలు

ఎడిఎంహెచ్ఒ అనురాధ

ప్రజాశక్తి- జలుమూరు

జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా అదనపు డిఎంహెచ్ఒ డాక్టర్ ఎన్.అనురాధ సిబ్బందికి ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పిహెచ్‌సి అమలవుతున్న వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను వైద్యాధికారి చల్ల వంశీకృష్ణను అడిగి తెలుసుకున్నారు. రోజూ పిహెచ్‌సికి ఓపిలో అనుమానిత క్షయరోగులు నుంచి కఫాన్ని సేకరించి బుడితి సామాజిక ఆరోగ్య కేంద్రానికి పంపించాలని ఆదేశించారు. అలాగే కుష్టు వ్యాధిగ్రస్తుల వివరాలు, చికిత్స పొందుతున్న విధానం, వారి కేసు కార్డులు, రికార్డులు, క్షయ రోగుల కేస్ కార్డులను పరిశీలించారు. జ్వర పీడితుల నుంచి తప్పనిసరిగా రక్త పూతలను సేకరించాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ అన్ని యాప్‌ల లక్ష్యాలను, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ వాన సురేష్‌కుమార్, సిహెచ్ఒ పద్మావతి, ఫార్మసిస్టు అల్లు చినబాబు, రాజారావులు పాల్గొన్నారు.


ఫిర్యాదు చేస్తున్న సత్యవతి

ఖర్గే రక్షణ బాధ్యత కేంద్రానిదే

ప్రజాశక్తి- ఆమదాలవలస

అఖిలభారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను హతమారుస్తానని కర్ణాటక రాష్ట్రంలోని చిత్తాపూర్ బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి మణికంఠ రాథోడ్ చేసిన వ్యాఖ్యలు నేపథ్యంలో కరిగే రక్షణ బాధ్యత కేంద్రంలోని బిజెపి దేనిని మాజీ ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షులు బొడ్డేపల్లి సత్యవతి అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మణికంఠ రాథోడ్‌పై సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.పైడయ్యకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కర్ణాటకలో ఎన్నికలు జరుగుతున్న తరుణంలో కాంగ్రెస్ పార్టీకి అత్యధిక స్థానాలు వస్తున్నాయని సర్వేలు తేల్చి చెప్పాయని అన్నారు. అలాగే కర్ణాటక రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపుతుండడంతో బిజెపి పార్టీ అసూయ ద్వేషాలు పెంచుకొని కుట్ర హత్య రాజకీయాలకు పన్నాగం పన్నాయని అన్నారు. ఈ నెల ఆరున చిత్తాపూర్ బిజెపి అభ్యర్థి మణికంఠ రాథోడ్ మల్లికార్జున ఖర్గే అతని సతీమణి కుటుంబ సభ్యులను హతమారుస్తానని అన్నారని, ఈ విషయం యావత్ దేశ ప్రజలకు తెలిసిందేనని అన్నారు. మణికంఠ రాథోడ్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, బిసిసెల్ రాష్ట్ర కన్వీనర్ సనపల అన్నాజీరావు, లఖినేని నారాయణరావు, బస్వా షణ్ముఖరావు, బొత్స వెంకటరమణ, పైడి శ్రీరాములు పాల్గొన్నారు.

క్వారీలో బాంబుల మోత

భయపడుతున్న అల్లిపల్లిగూడ ఆదివాసీలు

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని వైకుంఠపురం పంచాయతీ పరిధిలోని అల్లిపిల్లగూడ సమీపంలో ఉన్న కొండల్లో తవ్వకాలు జరుగుతున్నాయని, దీనివల్ల ప్రతిక్షణం భయభ్రాంతులకు గురవుతున్నామని, ఆ క్వారీ నుంచి మమ్మల్ని రక్షించాలని ఆదివాసీలు అధికారులను కోరుతున్నారు. గ్రామంలో 12 ఏళ్లుగా నివాసముంటున్నారు. ఆరు నెలలుగా ఇక్కడ క్వారీ తవ్వకాలు చేయడంతో రోజూ బాంబులు పేల్చడంతో చెవులు చిల్లులు పడేలా శబ్దాలు వస్తున్నాయని, రాళ్లు తుళ్లి ఇళ్లపై వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అడిగితే బెదింపులకు పాల్పడుతుడూ వేధిస్తున్నారని వాపోయారు. అన్ని శాఖల అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని అన్నారు. ఇటీవల పెద్ద పెద్ద బాంబులు తీసుకొచ్చి పేల్చడంతో గ్రామంలోకి రాళ్లు తుళ్లి


బాంబులు పేల్చడంతో వస్తున్న దుమ్ము, ధూళి (ఇన్‌సెట్‌లో) విరిగిన ఇంటి రేకు

ఇంటి పడడంతో రేకులు కన్నమైందన్నారు. ఈ విషయమై ఇటీవల నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం వద్ద మొరపెట్టుకున్నామని, ఆయన స్పందించి మైన్స్ అధికారులతో మాట్లాడిఈ తవ్వకాలు నిలిపివేయాలని ఆదేశించారని, అయినా యథావిథిగా కొనసాగుతున్నాయని అన్నారు. ఇప్పటికైనా ఉన్నత శాఖ అధికారులు స్పందించి మమ్మల్ని ఆదుకోవాలని ప్రాణరక్షణ కల్పించాలని కోరుతున్నారు.

రేకులు పగిలిపోయాయి



ఆదివారం సాయంత్రం పేల్చిన బాంబుల వల్ల పెద్ద పెద్ద రాళ్లు దూసుకొచ్చి ఇంటిపై పడింది. దీంతో ఇంటి రేకులు పగిలిపోయాయి. నిద్రపోతున్న మా పాప పక్కన రాయి పడడంతో అస్వస్థత గురైంది. గంటకాలం తీరుకోలేకపోవడం డాక్టర్ వద్దకు తీసుకెళ్లాం. అలాగే క్వారీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న వ్యక్తి బెదిరిస్తున్నారు. లారీలు వచ్చినప్పుడు మిమ్మల్ని తొక్కిస్తానని భయపెడుతున్నారు. **- శోభన్‌బాబు**

గజిల్‌గెడ్డ కాలువపై చెట్లు నరికివేత

ప్రజాశక్తి- బూర్జ

మండల కేంద్రంలోని బూర్జ గజిల్‌గెడ్డ కాలువకు ఇరువైపులా ఉన్న విలువైన పెద్దపెద్ద చెట్లను మండలంలోని పాలవలసకు చెందిన కలప వ్యాపారి నరికి వేయించి అక్రమంగా సదూర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ విషయం అధికారులకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు బహిరంగంగా విమర్శిస్తున్నారు. రెవెన్యూ అధికారులకు ముడుపులు చెల్లిస్తున్నామని కలప వ్యాపారులు చెబుతుండడం విశేషం. అధికారులు పట్టించుకోకపోవడంతో వాళ్ళ ఆటలు సాగుతున్నాయి. గత రెండు రోజులుగా నాలుగు లారీలతో రూ.లక్షలు విలువ చేసే కలపను తరలిస్తున్నారు. అధికారులు సహకారం పుష్కలంగా ఉండడంతో కలప అక్రమ తరలింపుకు అడ్డుఅదుపు లేకుండాపోతోంది. తద్వారా వారు అడ్డగోలుగా పచ్చని చెట్లని నరికి వేస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. పచ్చదనంతోనే పర్యావరణ


గజిల్‌గెడ్డపై ఉన్న నరికేసిన చెట్ల కొమ్మలు

పరిరక్షణ అని అధికారులు, నాయకులు సమావేశాల్లో ప్రగల్భాలు పలుకుతున్నారని, కానీ, ఆచరణలో పాటించడం లేదని అన్న విమర్శలు వనిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని మండల వాసులు కోరుతున్నారు. ఇదే విషయమై శ్రీకాకుళం ఆర్‌డిఒ బి.శాంతిని వివరణ కోరగా... కలప అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పరిశీలించి చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ ఆదేశిస్తానని తెలిపారు.

ఎమ్మెల్సీ పరామర్శ

ఇచ్ఛాపురం : మండలంలోని టి.బరంపురంలో తిప్పన నారాయణరెడ్డి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు మృతుడి కుటుంబ సభ్యులను మంగళవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం నిర్వహించిన సంతాప సభలో పాల్గొన్నారు. ముందుగా నారాయణరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో కారింగి త్రినాథరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.


చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న ఎమ్మెల్సీ రామారావు


గూగుల్ మ్యాప్‌తో తప్పడు ఆరోపణలు చేస్తున్నారని చూపిస్తున్న రవికుమార్

నిరాధార ఆరోపణలు మానుకోవాలి

జిల్లా టిడిపి అధ్యక్షులు రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

నియోజకవర్గంలో సైకోలు తయారయ్యారని, అటువంటి వారు తనపై లేనిపోని నిరాధార ఆరోపణలు చేస్తున్నారని వైసిపి నాయకుడు చింతాడ రవికుమార్‌ను ఉద్దేశించి టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ వ్యాఖ్యానించారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కొంతమంది వైసిపి నాయకులుగా కలలు కంటూ ఫ్లెక్సీల్లో బొమ్మలు వేసుకుంటూ సామాజిక మాధ్యాల్లో హల్‌చల్ చేస్తూ వ్యవహరిస్తున్న నేతలు వారిస్థాయి ఏమిటో గుర్తెరిగి నడుచుకోవాలని సూచించారు. అవాకులు చవాకులు మాట్లాడటం మానుకోవాలని హితవు పలికారు. 2009, 14 శాసనసభ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసిన తనకు ఆదరించిన నియోజకవర్గం ప్రజలకు తానేంటో తెలుసునని, వారికి జవాబు దారితనం కోసమే వివరణను ఇస్తున్నట్లు తెలిపారు. విశాఖపట్నంలో మురళీనగర్ ప్రాంతంలోని కప్పరాడ కొండ సర్వే నంబరు 9/5 లో ప్రభుత్వ భూమిని 2.5 ఎకరాలు ప్రభుత్వ విప్‌గా ఉన్న సమయంలో అక్రమంగా ఆక్రమించానని, దాని విలువ మార్కెట్లో రూ.వంద కోట్లు ఉంటుందని తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. తన కుటుంబ ప్రతిష్టను, పరువుకు భంగం కలిగిస్తూ గూగుల్ మ్యాప్ పత్రాలతో లేనిపోని ఆరోపణలు చేస్తూ శునకానందం పొందుతున్నాడని విమర్శించారు. ముఖ్యమంత్రికి చేసిన ఫిర్యాదులో 1.50 ఎకరాల భూమి అని, విలేకరుల సమావేశంలో 2.48 ఎకరాల భూమి అని రకరకాలుగా అవగాహనాలేమితో ఇష్టం వచ్చినట్లు కారు కూతలు కూయడం సరికాదన్నారు. తన భార్య కూన ప్రమీల పేరుతో 2008లో విశాఖపట్నంలోని మురళీగర్ ప్రాంతంలో కప్పరాడ కొండ దిగువన 700 గజాల జిరాతి భూమిని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసిన మాట వాస్తవమేనని అన్నారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలకు ఉపక్రమిస్తానని తెలిపారు. లేకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయించి చట్టపరంగా ముందుకు వెళ్తానని స్పష్టం చేశారు. ఒకవేళ నేరారూపణ నిజమని రుజువైతే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని సవాల్ విసిరారు. ఈయనతోపాటు టిడిపి నాయకులు సంపదరావు మురళి, బి.వి.రమణమూర్తి ఉన్నారు.


రాకేష్ మృతదేహం (ఇన్‌సెట్‌)లో రాకేష్ (ఫైల్)

చెరువులో మునిగి బాలుడు మృతి

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలోని పెద్దతుంగాం పెద్ద చెరువులో స్నానానికని వెళ్లి 8వ తరగతి చదువుతున్న పేరిశెట్టి రాకేష్ (14) మృతి చెందాడు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కోటబొమ్మాళి మండలం కురుడు కాలనీకు చెందిన పేరిశెట్టి గోవిందరావు, భారతికి చెందిన పెద్ద కుమారుడు రాకేష్. ఇటీవల వేసవి సెలవు ఇవ్వడంతో పది రోజుల క్రితం అమ్మమ్మ ఊరు మండలంలోని శివరాంపురం వచ్చాడు. సోమవారం సాయంత్రం అమ్మమ్మ ఇంటి నుంచి బంధువుల ఇల్లు పెద్దతుంగాం వెళ్లాడు. మంగళవారం ఉదయం 9 గంటలకు పెద్దతుంగాం పెద్ద చెరువుకి స్నేహితులతో కలిసి స్నానానికి వెళ్లారు. స్నానానికి దిగుతూ కాలుజారి చెరువులోకి వెళ్లిపోయాడు. ఈత రాకపోవడంతో చెరువులో మునిగిపోయాడు. వెంటనే తోటి స్నేహితులు గ్రామంలోని పెద్దలకు సమాచారం అందజేశారు. గ్రామస్తులు వచ్చి చూసే సరికి అప్పటికే మృతి చెంది మృతదేహం చెరువులో తేలియాడుతూ కనిపించింది. సమాచారం అందుకున్న ఎస్ఐ కె.మధుసూదనరావు సంఘటనా స్థలానికి చేరుకుని శవ పంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం కోటబొమ్మాళి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. దీంతో మూడు గ్రామాల్లో విషాద ఛాయలు అలుమున్నాయి.


రక్తదానం చేస్తున్న అక్షిత్, ప్రసాద్

రక్తదాతలు స్ఫూర్తి ప్రదాతలు

కవిటి : ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో తామకుతామే సాటని నిరూపించుకోవడమే కాకుండా... నేటితరానికి స్ఫూర్తి ప్రదాతలుగా నిలుస్తున్నారు పలువురు యువకులు. విశాఖ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కవిటి మండలానికి చెందిన ఇద్దరు రోగులకు ఎ పాజిటివ్, బి నెగిటివ్ రక్తం అత్యవసరమైంది. దీంతో హైదరాబార్ నుంచి సొంత గ్రామానికి వస్తున్న మండలంలోని లోళ్లపుట్టుగకు చెందిన లోళ్ల అక్షిత్ ఎ పాజిటివ్, బెజ్జిపుట్టుగకు చెందిన బి.ప్రసాద్ బి నెగిటివ్ రక్తాన్ని అందించారు. ఈ సందర్భంగా తమ కోసం విశాఖ ట్రైన్‌లో వచ్చి రక్తదానం చేసిన యువకులను బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్తులు, స్నేహితులు అభినందనలు తెలియజేశారు.

నేత్రాలపై అప్రమత్తం

రణస్థలం: నేత్రాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కళ్యాణి కంటి ఆస్పత్రి డాక్టర్ కళ్యాణి అన్నారు. మండల కేంద్రంలో కళ్యాణి కంటి ఆస్పత్రి ఆధ్వర్యాన మంగలవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరానికి 65 మంది రోగులు పాల్గొన్నారు. వారికి వైద్య పరీక్షలు నిర్వహించి తొమ్మిది మందికి నేత్ర శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. వారిని శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి బస్సులో తరలించారు. ఈ సందర్భంగా డాక్టర్ కళ్యాణి మాట్లాడుతూ వయసు పెరుగుతున్న కొద్దీ కంటి సమస్య ఎక్కువగా వస్తాయని అన్నారు. సరైన అవగాహన లేక అశ్రద్ధ చేస్తే చూపు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు.


దర్శించుకుంటున్న స్పీకర్ దంపతులు

చెవిటమ్మ తల్లి సందర్శన

ఆమదాలవలస : పురపాలక సంఘ పరిధిలోని మెట్టక్కివలసలో చెవిటమ్మతల్లి గ్రామ దేవత పండగలు నిర్వహిస్తున్నారు. శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం దంపతులు మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి చిత్రపటాన్ని స్పీకర్ దంపతులకు అందజేశారు. 11 ఏళ్ల తర్వాత ఈ పండగను ప్రజలు జరుపుకుంటున్నారు. ఈ నెల 5 నుంచి 9వ ఈ పండగను అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో బొడ్డేపల్లి రమేష్‌కుమార్, అజంతా కుమారి, ఉమామహేశ్వర రావు, అత్తులూరి రవికాంత్, విజయ్ పాల్గొన్నారు.

యాప్‌లో నమోదు తప్పనిసరి

బూర్జ : లోకోస్ యాప్‌లో ప్రతి మహిళా సంఘం సభ్యుల పేర్లు నమోదు చేయాలని ఎపిఎం బాబూరావు అన్నారు. మండలంలోని స్థానిక ఐకెపి కార్యాలయంలో వివిఒల శిక్షణా తరగతుల్లో మంగళవారం పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేర్లు నమోదు చేసిన రోజే ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అందుతాయని అన్నారు. డ్వాక్రా సంఘం మహిళా అధ్యక్షులు శ్రీదేవి, సిసి స్వామి నాయుడు, కంప్యూటర్ ఆపరేటర్ మురళి పాల్గొన్నారు.

నాణ్యతలో రాజీ వద్దు

టెక్కలి: నాడు-నేడు కింద మంజూరైన పాఠశాల భవనాల నిర్మాణాల పనులు త్వరితగతిన పూర్తి చేసి రానున్న విద్యా సంవత్సరానికి పూర్తి చేయాలని టెక్కలి డివిజన్ ఉప విద్యాశాఖాధికారిని గార పగడాలమ్మ ఆదేశించారు. పట్టణంలోని బాలికోన్నత, బిసి కాలనీలోని పాఠశాలల్లో చేపడుతున్న పనులను మంగళవారం పరిశీలించారు. పనుల నాణ్యతపై రాజీకి రావద్దని కోరారు. బిసి కాలనీ పాఠశాల పరిధిలోని విద్యార్థుల ఇంటికి వెళ్లి చదవడం అంటే మాకిష్టం కార్యక్రమాన్ని పరిశీలించి ప్రవేశాల డ్రైవ్‌ని పర్యవేక్షించారు. జెవికె కిట్ల కేంద్రాన్నీ పరిశీలించారు. ఈమెతో పాటు ఎంఇఒ నాగభూషణం, ఉపాధ్యాయులు అరుణకు మార్, మహేంద్రాడ సింహాచలం ఉన్నారు.


ప్రవేశపత్రాన్ని అందజేస్తున్న పగడాలమ్మ

ఉన్నత లక్ష్యాల సాధనకు కృషి

సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి


విద్యార్థులను అభినందిస్తున్న సబ్ కలెక్టర్

ప్రజాశక్తి- టెక్కలి

ఇటీవల వెలువడిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో టెక్కలి డివిజన్‌లోని పాతపట్నానికి చెందిన మహాపాత్రో 594, సారవకోట కెజిబివిలో చదివిన ఊర్లాన జాహ్నవి 590, టెక్కలి మహాత్మ జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలలో చదివిన తెంబూరు చాందిని 581, ధర్మాన సేవిత 581 మార్కులు సాధించారు. వీరికి సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి మంగళవారం అభినందనలు తెలిపారు. షీల్డ్‌తో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉన్నత చదువులతో పాటు లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఫలితాల సాధనకు కృషి చేసిన ఉపాధ్యాయులనూ అభినందించారు. కార్యక్రమంలో టెక్కలి డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి గార పగడాలమ్మ, ఎంఇఒ దాసరి నాగభూషణరావు పాల్గొన్నారు.


ఆర్‌టిసి కాంప్లెక్స్‌లను అభివృద్ధి చేయాలి

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్‌లను అభివృద్ధి చేయాలని సీడ్ ఎపి చైర్మన్ శాడి శ్యామ్‌ప్రసాద్ రెడ్డి కోరారు. ఈ మేరకు విజయవాడలోని ఆర్‌టిసి వైస్ చైర్మన్, ఎండిసిఇచ్ డి.తిరుమలరావును మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఇచ్ఛాపురం, సోంపేట ఆర్‌టిసి కాంప్లెక్స్‌లను ఆధునికీకరించాలన్నారు. కంచిలి బస్టాండ్‌లో ఆర్‌టిసి బస్సులు నిలుపుదల చేయాలన్నారు. అలాగే కవిటి బస్టాండ్ వద్ద వసతులు కల్పించాలన్నారు. అలాగే కాంప్లెక్స్ ఆవరణలో కమర్షియల్ షాప్‌లు ఏర్పాటు చేసి వసతులు కల్పించి ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు ప్రయత్నించాలని కోరారు.


వినతిపత్రం అందజేస్తున్న శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

లావేరు: ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని బిజెపి మండల నాయకులు ఇజ్జడా శ్రీనివాసరావు అన్నారు. లావేరులోని కార్యకర్తలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఎన్నికల్లో వైసిపి ఇచ్చిన హామీలు, వాటి అమలు, వైఫల్యాలపై ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి పి.వి.రత్నం, మండల ప్రధాన కార్యదర్శి విపర్తి ఆదియ్య, పి.అప్పలనాయుడు, మీసాల దేవుడమ్మ, జనపాల గోవిందరావు, రౌతు శ్రీరాములు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీనివాసరావు

సంక్షిప్త వార్తలు

డిగ్రీ విద్యార్థుల ప్రతిభ

టెక్కలి : టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెదటి సంవత్సరం బిఎస్‌సి డిగ్రీ చదువుతున్న వర్జాన శ్రావణి, గౌడ గౌతమిలు రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొని ద్వితీయ స్థానం సంపాదించారు. వీరికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ మంగళవారం అభినందించారు. ఈ నెల 1 నుంచి 5 వరకు తిరుపతిలో ఎపిసిఎం కప్ హ్యాండ్‌బాల్ పోటీలు జరిగాయి. అందులో పాల్గొన్న తమ కళాశాల విద్యార్థు లు ద్వితీయ స్థానం సంపాదించడం అభినందించదగ్గ విషయమన్నారు. అందుకు కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయులు బి.సత్యనారాయణను అభినందించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బేపలసతీష్‌కుమార్, కో-ఆర్డినేటర్ లూక్‌పాల్, బాలకృష్ణ పాల్గొన్నారు.

స్థల పరిశీలన

కోటబొమ్మాళి: మండల కేంద్రంలో అంబేద్కర్ ఆడిటోరియం నిర్మాణానికి స్థలం కావాలని ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావుకు విన్నవించుకున్నారు. దీంతో ఎంపిపి స్పందించి ఆడిటోరియం నిర్మాణానికి స్థలం పరిశీలించాలని మండల సర్వేయర్‌కు సూచించారు. దీంతో మండల పరిషత్ వాణిజ్య సముదాయాల వెనుక ఉన్న స్థలాన్ని మంగళవారం పరిశీలించారు. సర్పంచ్ కాళ్ల సంజీవరావు, దళిత నాయకులు బోకర జడ్డన్న, సింహాచలం, మల్లయ్య, భాస్కరరావు, సంజీవరావు పాల్గొన్నారు.


అధికారులకు వివరిస్తున్న 'ఉపాధి' కూలీలు

'ఉపాధి'లో అక్రమాలు

సోషల్ ఆడిట్‌లో బట్టబయలు

బూర్జ: మండలంలోని అన్నంపేటలో ఉపాధి హామీ కింద చెరువు పనుల్లో అవినీతి అక్రమాలు చోటుచేసుకున్నట్లు సోషల్ ఆడిట్‌లో బట్టబయలైంది. నాలుగు రోజులుగా గ్రామంలో నిర్వహిస్తున్న సోషల్ ఆడిట్‌లో కూలీలు వారి బాధలను అధికారుల ముందు వెల్లడించారు. హైదరాబాద్, విశాఖపట్నం వంటి పట్టణ ప్రాంతాల్లో పనిచేసుకుంటున్న వారికీ మస్టర్లు వేయడంతో వారి బ్యాంకు ఖాతాలకు నేరుగా డబ్బు జమవుతుందని అన్నారు. ఈ విధంగా ఉపాధి సిబ్బంది అక్రమాలకు పాల్పడుతున్నారని వాపోయారు. మండుతున్న ఎండల్లో రెక్కలు ముక్కలు చేసుకుని కష్టపడి పనిచేసిన నిరుపేదలమైన తమకు శ్రమకు తగ్గ ఫలితం దక్కడం లేదని సోమవారం నిర్వహించిన గ్రామసభలో వెల్లడించారు. పనులకు రాకుండానే పెద్దంటి వారి కుటుంబాల, అస్తుల పేర్లు రాయించుకుని డబ్బులను జమ చేసుకుంటున్నారని ఆరోపించారు. అవినీతికి అవసరమైన రుజువులు, ఆధారాలు సమాచార హక్కు చట్టం ద్వారా తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. అక్రమాలకు పాల్పడిన వారిని వెంటనే ఉద్యోగాల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. దీంతో ఆడిట్ అధికారులు ఏం చేయాలో తోచక తెల్ల ముఖం వేశారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని చెప్పి సభ ముగించారు.

వైభవంగా గ్రామదేవత ఉత్సవాలు

ఇచ్ఛాపురం : గత కొద్ది రోజులుగా అంగరంగ వైభవంగా గ్రామ దేవత శ్రీ స్వేచ్ఛావతి అమ్మవారు సంబరాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం రాత్రి మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్యే బెందాళం అశోక్, సతీమణి నిలోత్పల, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి పాల్గొన్నారు. విజయ తిరువీధి అమ్మవారు ఘట్టాన్ని నెత్తిపై ఎత్తుకుని నడుచుకుంటూ వెళ్లారు. ఉత్సవాలు ముగింపు దగ్గర పడుతుండడంతో ప్రజల రద్దీ అనూహ్యంగా పెరిగింది. పెరుగుతున్న ప్రజలను దృష్టిలో ఉంచుకుని పోలీసులు, అధికారులు ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేకంగా దృష్టిసారించారు. ప్రధాన కూడలి వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు ఏర్పాటు చేశారు. పెద్ద వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధించి ట్రాఫిక్‌ను నియంత్రించారు. మున్సిపల్ ఛైర్పర్సన్ రాజ్యలక్ష్మి, వైస్ చైరపర్సన్ లు భారతీ దివ్య, లాభాల స్వర్ణ మణి పలువురు వైసీపీ నేతలు పాల్గొన్నారు..పోలీస్ అధికారులు కూడా మంగళవారం నాడు బందోబస్తు సవాల్ గా మారింది. రద్దీ విపరీతంగా పెరగడం తో పోలీస్ అధికారులు ట్రాఫిక్ నియంత్రణలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.


అమ్మవారిని మోస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ


మెమొంటోలను అందజేస్తున్న కమిటీ సభ్యులు

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాలు

ఎచ్చెర్ల : మండలంలోని ధర్మవరం శాఖాగ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం రెండో రోజున శతక పద్యాలు, వాటి విశ్లేషణ గురించి మిథిలా విద్యాలయం కరస్పాండెంట్ ఎం.జయరాం వివరించారు. గ్రంథాలయాధికారి మల్లిపెద్ది చంద్ర శేఖరరావు, సహాయకులు బి.సూర్యనారాయణ, గ్రంథాలయ పాఠకులు పొట్నూరు మధు, ముద్దాడ శేఖర్, బగ్గు జగదీష్, కిరణ్, సురేష్, మహేష్, 65 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

పొందూరు: పొందూరు శాఖాగ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు సౌరకుటుంబంపై గ్రంథాలయాధికారి భాస్కరరాజా అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు గ్రంథాలయం తరుపున నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.

రణస్థలం: స్థానిక శాఖాగ్రంథాలయంలో గ్రంథాలయాధికారి పి.వరలక్ష్మి ఆధ్వర్యాన విద్యార్థులతో దినపత్రికలు చదివించడం, కథలు చదివించడం రాయించడం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆంగ్ల ఉపాధ్యాయులు కె.భాస్కరరావు (స్పోకెన్ ఇంగ్లీష్) విద్యార్థులకు చెప్పారు.

సంతబొమ్మాళి : స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు ఇంగ్లీష్‌లో, గణితంలో మెలకువలను ఉపాధ్యాయులు పి.నారాయణ నేర్పారు. గ్రంథాయాధికారి కె.రామకృష్ణ పాల్గొన్నారు.

నౌపడ : నౌపడ శాఖాగ్రంథాలయంలో విద్యార్థులకు ఆరోగ్యం పరిశుభ్రతపై స్థానిక ఆయుష్ వైద్యులు పి.మాధవి పలు సూచనలు చేశారు. వేసవిలో వడదెబ్బ బారిన పడకుండా అధికంగా నీటిని తీసుకోవాలన్నారు. గ్రంథాలయాధికారి రూపావతి, హెల్పర్ ప్రసాద్ పాల్గొన్నారు.


ఎచ్చెర్ల : మాట్లాడుతున్న జయరాం


సంతబొమ్మాళి : ఆర్థికసాయం అందజేస్తున్న ఎంపిడిఒ ఉమాసుందరి

పలువురికి ఆర్థికసాయం

సంతబొమ్మాళి కోటబొమ్మాళి మండలం చీపుర్లపాడు గ్రామ సచివాలయంలో జూనియర్ లైన్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్న శ్రీకాశి మురళి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు, అధిక వైద్య ఖర్చులు బరించడానికి ఇబ్బంది పడుతున్నాడు. ఈ సందర్భంగా సంతబొమ్మాళి మండలం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది రూ.25,300 విరాళాలు సేకరించారు. ఈ నగదును ఎంపిడిఒ ఉమసుందరి మంగళవారం ఆర్థికసాయం అందించారు. డి.శ్రీనివాసరావు, ఎస్.ఢిల్లేశ్వరరావు, మల్లేశ్వరరావు, విజయ కుమార్‌శర్మ, రమేష్, మహేష్, వనజాక్షి పాల్గొన్నారు.

ఎంజిఆర్...

హిరమండలం : హిరమండలం రెడ్డివీధికి లోకొండ అప్పారావు కుమారుడు గణేష్ కొద్ది రోజులు క్రితం ద్విచక్ర వాహన ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు, సామాజికవేత్త మామిడి గోవిందరావు రూ.పది వేలు ఆర్థికసాయం అందించారు. భవిష్యత్‌లో ఏ అవసరం ఉన్నా తనను సంప్రదిస్తే తప్పకుండా తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని తెలియజేశారు. కార్యక్రమంలో చవితిసిది మాజీ సర్పంచ్ మిర్యాబిల్లి భగవాన్‌దాస్, పోతురాజు శ్రీధర్, రెల్ల దామోదర్, ఎల్ఎన్‌పేట మండల మాజీ అధ్యక్షులు వెలమల గోవిందరావు, ఎఎంసి మాజీ చైర్మన్ కాగాన మన్మథరావు, కోయిలాపు కృష్ణమాచార్యులు, అంపిలి పోలినాయుడు, ముగుడ భద్రయ్య, జాడుపేట వెంకటరమణ, కుంచాల బాలకృష్ణ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మండలంలోని మశఖపురంలో లివర్ జాండిస్ వ్యాధితో బాధపడుతున్న అంబటి మదయ్యాకు గ్రామ యువకులు తమ వంతుగా రూ.15 వేలు, పవన్ సేవా సంస్థ నుంచి రూ.4 వేలు ఆర్థికసాయం అందించారు. ఈ ఆర్థికసాయాన్ని జనసేన పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తిప్పాన దుర్యోధనరెడ్డి చేతుల మీదుగా మంగళవారం ఆర్థికసాయాన్ని అందించారు. కార్యక్రమంలో బాలరాజు, ప్రేమ్, ధర్మరాజు పాల్గొన్నారు.